క్లుప్తంగా

ఇస్కాన్ పోటీలలో ఎస్పీడబ్ల్యూ విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నారాయణమ్మ

తిరుపతి సిటీ: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా స్థానిక ఇస్కాన్ టెంపుల్ నిర్వహించిన వివిధ పోటీలలో తమ కళాశాలకు చెందిన పది మంది విద్యార్థినులు బహుమతులు గెలుచుకోవడం సంతోషకరమని పద్మావతి మహిళా డిగ్రీ/పీజీ కాలేజీప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ హర్షం వ్యక్తం చేశారు. ప్రతిభ కనబరచిన విద్యార్థినులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో కరికులమ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కృష్ణవేణి, అధ్యాపకులు డాక్టర్ జ్యోతి, ధనలక్ష్మి, మమత, శోభ, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళావర్సిటీలో జాతీయ సదస్సు



మాట్లాడుతున్న కొలంబో విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ సీనియర్ ప్రొఫెసర్ అమృతలింగం

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ అధ్యయన కేంద్రం, ఎస్వీయూ ఎకనోమెట్రిక్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం 'ఇంటర్నేషనల్ ఎకనామిక్స్ రిలేషన్స్ ద సస్టైనబుల్ డెవలప్‌మెంట్ ఛాలెంజెస్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. మహిళా వర్సిటీ సావేరి సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఈ సదస్సుకు శ్రీలంక కొలంబో విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ సీనియర్ ప్రొఫెసర్ కే.అమృతలింగం కీలకోపన్యాసం చేశారు. ఇండియా, శ్రీలంక మధ్య ఆర్థిక సంబంధాలు, పరస్పర సహకారంపై ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు కిరణ్ ప్రసాద్, డాక్టర్ ఆర్ముగం, కృష్ణమూర్తి, గీతాంజలి, కన్వీనర్లు మాధి, సునీత, నీరజ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వెటర్నరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమాశేంలో మాట్లాడుతున్న ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షులు చిన్నబాబు

తిరుపతి సిటీ: వెటర్నరీ వర్సిటీలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు, దినసరి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షులు చిన్నబాబు డిమాండు చేశారు. వర్సిటీలో బుధవారం కార్మికుల సమస్యలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్సిటీలో పనిచేస్తున్న కార్మికులు అరకొర జీతాలతో కుటుంబాలను పోషించుకుంటున్నారని, అధికారులు స్పందించి జీతాలు పెంచాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు లేకపోవడంతో పోలీసులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉపాధ్యక్షులు టి.సుబ్రమణ్యం, బుజ్జి, జూనపూడి ఎజ్రా, ఆప్కాస్ నాయకులు పాల్గొన్నారు.

శ్రీకపిలేశ్వరాలయంలో లక్ష కుంకుమార్చన రేపు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 30న శుక్రవారం శ్రీకామాక్షి అమ్మవారికి శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 12 గంటల వరకు గణపతి పూజ, లక్ష కుంకుమార్చన, సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామి , అమ్మవార్ల తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు.

లక్కీడిప్‌లో శ్రీవారి అంగప్రదక్షిణ టోకెన్ల కేటాయింపు

తిరుమల: ప్రతి శనివారం తిరుపతి అర్బన్, తిరుమల స్థానికులకు కేటాయిస్తున్న 250 శ్రీవారి ఆలయ అంగప్రదక్షిణ టికెట్లు, ఇకపై లక్కీడిప్ నిర్వహించి కేటాయించనున్నట్లు బుధవారం టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ టికెట్లు కావలసిన భక్తులు గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తమ ఆధార్ కార్డుతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సాయంత్రం 5 గంటలకు లక్కీడిప్ నిర్వహిస్తారు. టికెట్లు పొందిన భక్తులకు వారి మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం ఇస్తారు. ఆన్‌లైన్‌లో ఉంచబడుతుంది. ఇలా టికెట్లు పొందిన భక్తులు ఆన్‌లైన్‌లో రూ.500 డిపాజిట్ చేయవలసి ఉంటుంది. అలాగే వీరు మహతి కళాక్షేత్రంలో తమ ఆధార్ కార్డు చూపి శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు అంగప్రదక్షిణ టికెట్లు పొందవచ్చు. లక్కీ డిప్ లో టికెట్లు పొందిన భక్తులను శనివారం తెల్లవారుజామున అంగప్రదక్షిణకు అనుమతిస్తారు. అనంతరం భక్తులు చెల్లించిన రూ.500 డిపాజిట్‌ను తిరిగి వారి ఖాతాల్లోకి టీటీడీ జమ చేస్తుంది. స్థానికులు కాకుండా లక్కీడిప్‌లో అంగప్రదక్షిణ టోకెన్లు పొందిన వారిని అంగప్రదక్షిణకు అనుమతించరు.

భద్రత కల్పించాలి



మహిళలు, యువతులు, చిన్నారులపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి, దారుణ హత్య ఉదంతం మమ్మల్ని కలచివేస్తోంది. మనం ఎలాంటి సమాజంలో జీవిస్తున్నామో అని భయమేస్తుంది. రాత్రిపూట ఆస్పత్రికి వచ్చే రోగులకు సహాయకులుగా వస్తున్నవారు మద్యం సేవించి వస్తున్నారు. సిబ్బందిపై దురుసుగా ప్రవర్తిస్తుంటారు. ఒక్కోసారి శృతిమించుతూ ఉంటుంది. ఈ పరిస్థితులు పునరావృతం కాకుండా పోలీస్ గస్తీ నిర్వహించాలి. వైద్య వైద్యులు, వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి.

- తేజోవతి, వైద్యాధికారి, కుప్పంబాదూరు పీహెచ్‌సీ, రామచంద్రాపురం మండలం



కఠినమైన చట్టాలు తీసుకురావాలి



మహిళలపై జరుగుతున్న హత్యాచారాలు, హత్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకురావాలి. ప్రాణాపాయస్థితిలో ఉన్న వారికి వైద్యం అందించి పునర్జన్మను ప్రసాదించే మహిళా వైద్యులకే రక్షణ లేకుండా ఎలా? కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై లైంగికదాడి, దారుణ హత్య ఘటన యావత్తు దేశాన్నే దిగ్భ్రాంతికి గురిచేసింది. నిందితుడిని పట్టుకున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. అలాంటి దుర్మార్గులకు పాల్పడుతున్న వారికి వెంటనే కఠిన శిక్షలు అమలు చేస్తే ఇలాంటివి పునరావృతం కావు.

-డాక్టర్ పి. జయంతి, మంగళం పీహెచ్‌సీ

ఏం జరిగినా..గప్‌చుప్!

- వర్సిటీలో బయట వ్యక్తుల సంచారం
- అధికార పార్టీ పేరిట ఓవరాక్షన్
- అధికారులకు తెలిసినా కట్టడికి చర్యలు శూన్యం



ఎస్వీయూనివర్సిటీ ముఖద్వారం

తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో. యువతను తప్పుదోవ పట్టించే అరాచక శక్తులు, అల్లరి మూకలు తిష్టవేశాయా? అనే అనుమానం అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులలో కలుగుతోంది. నిత్యం వర్సిటీకి సంబంధం లేని వ్యక్తులు రాత్రీ పగలూ అనే తేడా లేకుండా వర్సిటీలో సంచరిస్తున్నారు. ఎస్వీయూ పరిపాలనా భవనం, విద్యార్థుల వసతి గృహాలు, క్యాంటీన్ పరిసర ప్రాంతాలలో విద్యార్థులు, ఉద్యోగుల కంటే బయట వ్యక్తులే ఎక్కువ కనిపిస్తున్నారు. ఇప్పటికే నగరంలోని ఓ యూనివర్సిటీలో మత్తు పదార్థాలను విద్యార్థులకు అలవాటు చేసి పెడదోవ పట్టించిన ఘటన విదితమే. ఇలాంటి సంఘటనలు వర్సిటీలలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే వర్సిటీల అధికారులకు పోలీసులను కోరారు.

గంజాయి మూలాలపై ఆరా...!

ఎస్వీయూలో బయట వ్యక్తులు హల్‌చల్ చేస్తున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచినట్లు సమాచారం. విద్యార్థులను మభ్యపెట్టి గంజాయి మత్తుకు అలవాటు చేసే అరాచక శక్తులపై పోలీసులు, వర్సిటీ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. వర్సిటీలో ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మత్తు పదార్థాల ఊబిలోకి దించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు ఉన్నాయి. నగరానికి సమీపంలో ఉన్న ఎస్వీయూలో మూడో కంటికి తెలియకుండా తరచూ కొన్ని ఘటనలు జరుగుతున్నాయని ఉద్యోగులు, విద్యార్థులు చెబుతున్నారు. ఈ విషయంపై రెండు వారాల క్రితం వర్సిటీ అధికారులు ఎస్పీని కలసి గస్తీ పెంచాలని కోరినట్లు విశ్వసనీయ సమాచారం.

బయటి వ్యక్తుల సంచారంపై ఉద్యోగుల అసహనం

వర్సిటీలోని ప్రధాన అధికారుల పేషీలలో నిత్యం బయటి వ్యక్తులు సంచరిస్తున్నారని బోధనేతర సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏదో పని నిమిత్తం వచ్చినట్లు కహానీలు చెబుతూ చివరకు తాము ఫలానా అధికార పార్టీకి చెందిన వారంటూ ఉద్యోగులపై పెత్తనం చెలాయించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది అధికారులకు తెలిసినా వారిని కట్టడి చేయడానికి చర్యలు తీసుకోకపోవడం ఉద్యోగులకు విస్తుగొలుపుతోంది. ఎమర్జెన్సీ ఫైల్స్‌పై సంతకాలు చేయాలన్నా అధికారులకు సమయం ఇవ్వకుండా వారిని అనవసర చర్చల్లోకి దించి కాలయాపన చేస్తున్నారని ఉద్యోగులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు బయట వ్యక్తులను పేషీలలోనికి, వర్సిటీలోని పరిపాలనా భవనంలోనికి రాకుండా కట్టడి చేయాలని కోరుతున్నారు.

ఆర్పీఎఫ్ స్ఫూర్తితోనే విధులు నిర్వర్తిస్తున్నా..!



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి

- డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి
- తిరుపతిలో దక్షిణ మధ్య రైల్వే ఆర్పీఎఫ్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం

తిరుపతి(అలిపిరి): తన రక్తంలో ఆర్పీఎఫ్ జీర్ణించుకుపోయిందని.. ఇప్పటికీ ఆ స్ఫూర్తితోనే విధులు నిర్వర్తిస్తున్నానని తిరుపతి జిల్లా డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి అన్నారు. తిరుపతిలోని ఆర్పీఎఫ్ బ్యారక్స్ మీటింగ్ హాల్లో బుధవారం దక్షిణ మధ్య రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షిక సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడారు. తాను డిప్యూటీ కలెక్టరే అయినా తన ప్రస్థానం ఆర్పీఎఫ్ ఎస్ఐగా మొదలైందని, తర్వాత సికిందరాబాద్‌లోని మౌలాలీ ట్రైనింగ్ సెంటర్లో మూడేళ్లపాటు పనిచేశానన్నారు. తదనంతరం ఉద్యోగానికి రాజీనామా చేసి డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ నుంచి డిప్యూటీ కలెక్టర్ కావడం వరకు ఉద్యోగ పరంగా తన అనుభవాలను పంచుకున్నారు. ప్రధానంగా గుంతకల్‌లో ఉద్రిక్తతకు దారితీసిన ఆక్రమణల తొలగింపు సమయంలో అటు రైల్వే, ఇటు ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసి పరిష్కరించేందుకు ఆర్పీఎఫ్ ఎస్ఐ అనుభవం తనకు ఎలా ఉపయోగపడిందో ఆసక్తికరంగా వివరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఒకనాటి తన ఆర్పీఎఫ్ సహోద్యోగులను ఇక్కడ సమావేశంలో కలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కొందరు విశ్రాంత ఉద్యోగులు తాము ఎదుర్కొంటున్న భూ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

రిటైర్డ్ అయ్యాక సేవలు చేయడం గొప్ప

ఆర్పీఎఫ్ సీఐ మధుసూదన్ మాట్లాడుతూ, సర్వీసులో ఉన్నప్పుడు సేవ చేయడం గొప్ప కాదని.. రిటైర్డ్ అయిన తర్వాత సేవలు చేయడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. రిటైర్డ్ ఆర్పీఎఫ్‌లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించడంలో తిరుపతి అసోసియేషన్ నాయకులు టెక్నాలజీపై సైతం అవగాహన పెంచుకుని క్రియాశీలకంగా పనిచేస్తున్నారని కితాబిచ్చారు. 80వ దశకం నుంచి ఆర్పీఎఫ్‌లలో ఉన్నత చదువులు చదివిన వారు సైతం చేరుతున్నారని, డిప్యుటేషన్‌పై సీబీఐ, ఇతర శాఖలకు వెళ్లిన వారూ ఎందరో ఉన్నారన్నారు. అనంతరం ఫ్యామిలీ పెన్షన్, సెకండరీ ఫ్యామిలీ పెన్షన్ సమస్యలపై చర్చించారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్‌ను, వివిధ డివిజన్ల నాయకులను సన్మానించారు. సమావేశంలో తిరుపతి, విజయవాడ, గుంతకల్, సికిందరాబాద్, సికిందరాబాద్ హెడ్ క్వార్టర్స్ అసోసియేషన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఎస్.మనోహరం, హఫీజాఖాన్, కనకారావు, ఎన్‌సీఎస్ రెడ్డి మధుసూదన్, వరప్రసాద్, రాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.మధుసూదన్, పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డీకేటీ భూమి అడ్డదారుల్లో కబ్జా

- న్యాయం చేయాలని బాధితుడి వినతి



అశోక్‌కుమార్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: ఏళ్ల తరబడి తమ అనుభంలో ఉన్న భూమిని కొందరు నకిలీ పత్రాలను సృష్టించి స్వా. దీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిపై సంబంధిత అధికారులు విచారణ చేసి తమకు న్యాయం చేయాలని అవిలాలకు చెందిన ఎం.అశోక్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవిలాల గ్రామ లెక్కదాఖలా సర్వే నంబర్ 491/1లో 4.55 ఎకరాల డీకేటీ భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నట్లు తెలిపారు. అయితే తమ స్థలాన్ని గతంలో కొందరూ పలు రూపాల్లో ఆక్రమించుకోవడానికి విఫలయత్నం చేశారని, దీంతో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి అడ్డుకట్ట వేశామన్నారు. ప్రస్తుతం తమ తండ్రి రమణారెడ్డి చనిపోవడంతో ఆయన పేరిట ఉన్న భూమిని కిలారి రామచంద్రనాయుడు ప్రభుత్వ అధికారులను లోబరుచుకొని, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని, పాస్ బుక్ పొందారని, తద్వారా తమ ఆధీనంలో నున్న భూమిలోకి ప్రవేశించి ప్రశ్నించిన తమను అడ్డుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. దీనిపై తాము హైకోర్టును ఆశ్రయించడంతో దీనిపై విచారణ చేయాలని కలెక్టర్‌ను ఆదేశించిందని పేర్కొన్నారు..ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.

అకడమిక్ విద్యపై సంస్కృత వర్సిటీ వీసీ సమీక్ష

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో అకడమిక్ విద్య, భవిష్యత్ కార్యాచరణపై అధికారులు, పలు విభాగాల డీన్లు, అధ్యాపకులతో బుధవారం వీసీ సమీక్షించారు. వర్సిటీలోని 24విభాగాలు, 6 ఉన్నత అభ్యసన కేంద్రాలలో అధ్యాపకుల కొరత, గెస్ట్ ఫ్యాకల్టీల కొనసాగింపు, అధ్యాపకుల సర్దుబాటు ఇత్యాది అంశాలతోపాటు ఆడిట్ బృందం సమర్పించిన నివేదికపై చర్చించారు. క్యాంపస్‌లో జరుగుతున్న క్లాస్ వర్క్, పరిశోధనలపై సమీక్షించి అధ్యాపకులకు పలు సూచనలు చేశారు.



ఆత్మీయంగా..ఆప్యాయంగా..!

రెండు నెలలుగా హైదరాబాద్‌లో ఉంటూ, మోకాళ్ల సర్జరీ బుధవారం తిరుపతికి విచ్చేసిన తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని పార్టీ నాయకులు, కార్యకర్తలు పద్మావతిపురంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ఎమ్మెల్యేతోపాటు, భూమన అభినయ్‌రెడ్డి ఆత్మీయంగా పలకరించారు. కూటమి ప్రభుత్వం పాలనపై చర్చించారు. చంద్రబాబు అధికార దాహంతో ప్రజలకు బూటకపు హామీలు ఇచ్చి మోసగించడం తప్ప మేలు చేసిన దాఖలాలే లేవన్నారు. మళ్లీ మనకు మంచి రోజులు వస్తాయని, అంతవరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, ప్రజా సమస్యలపై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. - తిరుపతి మంగళం

చిరుధాన్యాలతో ఆదాయం, ఆరోగ్యం



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తిరుపతి రూరల్: చిరుధాన్యాలను సాగు చేస్తే రైతులకు ఆదాయం పెరుగుతుందని, అలాగే చిరుధాన్యాల వినియోగంతో ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని పెరుమాళ్లపల్లె వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సరళ అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని పలు మండలాల రైతులకు బుధవారం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో చిరుధాన్యాలపై బుధవారం చిత్తూరు ఏరువాక కేంద్రం తరఫున అవగాహన సదస్సు నిర్వహించారు. చిరుధాన్యాలను ఎలా పండించాలి? సస్యరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట దిగుబడి, మార్కెటింగ్ విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యవసాయ క్షేత్రంలో చిరుధాన్యాల సాగుపై యాజమాన్య పద్ధతులు, ఆహారంగా తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలు, పోషక విలువల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సంధ్యారాణి, శాస్త్రవేత్తలు వసంత, శ్రీవల్లిదేవి, ఠాగూర్, నాగమణి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత: కలెక్టర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: మొక్కలు నాటడం అందరూ బాధ్యతగా భావించాలని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వన మహోత్సవం పోస్టర్లు, కరపత్రాలను అటవీశాఖ అధికారులతో కలసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పచ్చదనం పెంపుతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. 30న నిర్వహించే వన మహోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ సతీష్‌రెడ్డి, సామాజిక అటవీ విభాగం అధికారి ధర్మరాజు, ఫారెస్ట్ రేంజ్ అధికారిణి పీ.మాధవి అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కార్వేటినగరంలో పవిత్రోత్సవాలు ప్రారంభం

తిరుపతి(అలిపిరి): కార్వేటినగరంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఆగస్టు 29, 30వ తేదీల్లో పవిత్రోత్సవాలు నిర్వహించనున్నామని జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. వైదిక సంప్రదాయం ప్రకారం జాతాశౌచం, మృతశౌచం వంటి వేళల్లో ఆలయ ప్రవేశం నిషిద్ధం. అయినా యాత్రికులు, సిబ్బంది వల్ల తెలియక ఇలాంటి దోషాలు జరుగుతుంటాయని, దోష నివారణకు ఏటా పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ అని చెప్పారు. 29న ఉదయం ఆచార్య రుత్విక్‌వరణం, సాయంత్రం మృత్సంగ్రహణం, సేనాధిపతి తిరువీధి ఉత్సవం, పవిత్రోత్సవాలకు అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 30న ఉదయం మూలవర్లకు తిరుమంజనం, పవిత్రాల సమర్పణ నిర్వహిస్తారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు వీధి ఉత్సవం నిర్వహిస్తారు.

ఆగని విద్యుత్ బాదుడు

- విద్యుత్ పోరాట అమర వీరుల సంస్మరణ సభలో వామపక్షాల నేతలు
- 2000లో టీడీపీ ప్రభుత్వ పాశవిక దుశ్చర్యపై నిరసన



విద్యుత్ పోరాట అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న సీపీఎం, సీపీఐ నేతలు

తిరుపతి కల్చరల్: కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు చాపకింద నీరులా విద్యుత్ రంగంలో ప్రమాదకర విధానాలను అమలు చేస్తూ ప్రజల నడ్డి విరుస్తోందని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి.మురళి విమర్శించారు. 2000లో విద్యుత్ ఉద్యమాన్ని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పాశవికంగా అణచివేసేందుకు యత్నించింది. ఆ ఘటనలో పోలీసుల కాల్పుల్లో అమరులైన వారిని స్మరిస్తూ బుధవారం సీపీఎం కార్యాలయంలో విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించి మాట్లాడారు. 2000లో ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ మహోద్యమం సాగిందన్నారు. ఆ ఉద్యమ ఫలితంగా కొన్ని ఏళ్లపాటు ప్రభుత్వాలు విద్యుత్ చార్జీల జోలికి వెళ్లలేదన్నారు. ఈ పదేళ్ల కేంద్రంలో బీజేపీ విద్యుత్ రంగంలో దోపిడీని తీవ్రతరం చేసిందని దుయ్యబట్టారు. విద్యుత్ రంగాన్ని మొత్తం ఆదానీ, టాటా వంటి బడా కార్పొరేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కందారపు మురళి, జయచంద్ర, మాధవ్, సాయిలక్ష్మి లక్ష్మి, హేమలత, కే.వేణుగోపాల్, బుజ్జి, శ్రీనివాసులు, నరేంద్ర, మల్లిఖార్జునరావు, గంగులప్ప, సీపీఐ నేతలు ఎన్.డీ.రవి, గోవిందస్వామి, శివ పాల్గొన్నారు.

తిరుచానూరులో ఘనంగా ఉట్లోత్సవం



విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి(తిరుచానూరు): గోకులాష్టమి సందర్భంగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి అనుబంధ శ్రీ కృష్ణస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం ఉట్లోత్సవం వేడుకగా నిర్వహించారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు శ్రీకృష్ణస్వామికి అభిషేకం, సాయంత్రం 5 గంటలకు ఉయ్యాలసేవ, సాయంత్రం 6 గంటలకు శ్రీకృష్ణస్వామి ఊరేగింపు సందర్భంగా ఉట్లోత్సవం, ఆస్థానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గణేష్, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న ఉట్లోత్సవం

టీడీఆర్ బాండ్లపై సీఐడీ తనిఖీలు

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో టీడీఆర్ బాండ్లపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సీఐడీ అధికారులు తనిఖీలు చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో రికార్డులను పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల కోసం సేకరించిన భూమి, స్థలం ఇచ్చినవారు, వారికి నష్టం పరిహారం అందించే క్రమంలో టీడీఆర్ బాండ్లు కేటాయింపు, ఇప్పటి వరకు ఎంత మందికి ఇచ్చారు? ఇంకా ఎంతమంది అర్హులు? తదితర వాటిపై ఆరా తీశారు. భూమి విలువ పెంచి ఇచ్చారనే ఆరోపణలపై వివరాలు సేకరించారు.

వైభవంగా శ్రీకృష్ణుని ఊరేగింపు



చింతలపాళెంలో శ్రీకృష్ణుడి ఊరేగింపు

ఏర్పేడు: మండలంలోని చింతలపాళెంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి శ్రీకాళహస్తి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం శ్రీకృష్ణుని ఊరేగింపు వైభవంగా జరిగింది. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా స్వామివారి ప్రతిమను ఏర్పాటు చేశారు. ప్రతిమకు మూడు రోజుల పాటు వివిధ అభిషేకాలతో విశేషాలంకరణ చేసి, నిత్య పూజలు, భగవద్గీత శ్లోక పారాయణం నిర్వహించారు. బుధవారం స్వామివారి ప్రతిమకు పూజలు చేసి, భజనలు, కోలాటాలు, డప్పులు, భాజా భజంత్రీలతో పురవీధుల్లో ఊరేగించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, గ్రామస్తులు పూజలు చేసి దర్శించుకున్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి శ్రీకాళహస్తి కమిటీ అధ్యక్షుడు చింత సుబ్రమణ్యం యాదవ్, సభ్యులు వెంకటలక్ష్మి, రాజేష్, పెంచలయ్య, సుధ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజస్వామి ఆలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో సెప్టెంబర్ నెలలో పలు విశేష ఉత్సవాలు నిర్వహించనున్నారు. 6, 20, 27వ తేదీల శుక్రవారాల్లో సాయంత్రం 6 గంటలకు శ్రీఆండాళ్ అమ్మవారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగిస్తారు. అలాగే 4వ తేదీ ఉత్తర నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు ఉభయనాంచారులతో కలిసి శ్రీగోవిందరాజస్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. 13న శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ, 14 నుంచి 16వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. 18న శ్రీగోవిందరాజస్వామి గరుడ సేవ ఉంటుంది. 23న రోహిణి నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీపార్థసారథిస్వామి వారు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తారు.